పూడూరు: సోమన్‌గుర్తి గ్రామంలో బాడిబాట ర్యాలీ


బొంరాస్‌పేట: తుంకిమెట్ల బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కులకచర్ల మండలం అంతారంలో ...

గ్రామ గ్రామాన బడిబాట

- పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి
- తల్లిదండ్రులకు టీచర్ల కౌన్సెలింగ్

బొంరాస్‌పేట, జూన్ 7: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తుంకిమెట్ల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు అలివేలు, పరమేశ్వరి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తుంకిమెట్లలో వారు ఇంటింటికీ తిరిగి బడీఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా ఉపాధ్యాయులు బడిబాటలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న వసతి సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను చేర్పించి పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరుతున్నారు.

పూడూరు: తల్లిదండ్రులు బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్ఎంలు అంజిలయ్య, వెంకటేశం పేర్కొన్నారు. పూడూరు మండలం సోమన్‌గుర్తి గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తులు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో

నవాబుపేట : పులుమామిడి గ్రామంలో ...

సంగీత,నవీన్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వప్న, మాజీ చైర్మన్ వెంకట య్య, అంగన్‌వాడీ టీచర్లు , ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

కులకచర్ల: కులకచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఏఏపీసీ కమిటీ సభ్యులు బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బడీడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులను అభ్యర్థించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల బట్టలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయుల చేత బోధన నిర్వహిస్తున్నారని విద్యార్థులను ప్రభుత్వ బడులకు పంపించాలని కోరారు. కులకచర్ల మండలం అంతారం గ్రామంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణనాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏఏపీసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవాబుపేట: పులుమామిడి గ్రామంలో జరిగిన బడిబాటలో ఉన్నత పాఠశాల హెచ్ఎం మోకీల అంజయ్య పాల్గొన్నారు.ఎంతో మంది మేధావులు ప్రభుత్వ బడుల్లో విద్యను అభ్యసించిన వారే అని గుర్తుజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మంచి క్రీడాసామగ్రి కూడా అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే చించల్‌పేట గ్రామం లోనూ హెచ్ఎం పాండు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హన్మంత్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోపాల్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలి

మున్సిపల్ సాధారణ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కొడంగల్, జూన్ 7: వర్షాకాలంలో పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభమైందని, సీజన్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పనులను చేపట్టాలని సూచించారు. అదేవిధంగా మాన్‌సూన్ యాక్షన్‌లో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లను గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి కాలంలో తాగునీరు, బోర్ తదితర మరమ్మతు పనులకు సంబంధించిన బిల్లులపై సమావేశంలో చర్చించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ బలరాం, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి

ధారూరు, జూన్ 7: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని ధారూరు ఎంపీపీ జైదుపల్లి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాట్లాడుతూ నకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వం గుర్తించి అనుమతి ఇచ్చిన దుకాణాలల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. విద్యుత్ అధికారి మాట్లాడుతూ వర్షాకాలం రైతులు ప్రజలు విద్యుత్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో ధారూరు వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, వికారాబాద్ డివిజనల్ వ్యవసాయశాఖ అధికారి వినోద్‌కుమార్, ధారూరు ఎంపీడీవో నర్సింహులు, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీటీసీలు, వివిధ గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తాండూరు: రోహిత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న శ్రీశైల్‌రెడ్డి, రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, అభిమానులు

తాండూరు, జూన్ 7: తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం తాండూరులో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అభిమానులు బర్త్ డే కేక్ కట్ చేశారు. రక్త దాన శిబిరం నిర్వహించి జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాజకీయ రంగంలో ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తమకు ఆశీస్సులు తెలిపినవారికి రోహిత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీశైల్‌రెడ్డి, రాజుగౌడ్, నర్సింహులు, నయూం, నరేందర్ గౌడ్, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌చారి, నర్సిరెడ్డి, శకుంతల, శోభరాణి, సంగీతాఠాకూర్, అనురాధ తదితరులున్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీశైల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు రవీందర్‌సింగ్ తన్వార్, విజయ్‌కుమార్, పాండురంగారెడ్డి, సునీల్‌ప్రసాద్, తాహెర్‌బాండ్, నర్సింహులు, హన్మంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

పెద్దేముల్: మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ మండల కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సీహెచ్. రంగయ్య, గ్రామకమిటీ అధ్యక్షుడు డీవై ప్రసాద్, రాములు, శ్రీనివాస్, రవికుమార్‌రెడ్డి, దర్మీది వెంకటయ్య, చందర్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, పిల్లి వెంకట్, రమేశ్, చందర్, లక్ష్మణ్, సురేశ్, మహేశ్ గౌడ్, ఎల్లప్ప, సుందరప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

యాలాల: తాండూరు మాజీ శాసన సభ్యుడు రోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి జుంటుపల్లి శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి బీఆర్ఎస్ శ్రేణులతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలను తెలిపారు.

కళలను ఆదరించాలి..

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జడ్పీటీసీ హరిప్రియ

పరిగి, జూన్ 7 : ప్రాచీన కళలను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, జడ్పీటీసీ బి.హరిప్రియ పేర్కొన్నారు. శుక్రవారం పరిగిలోని టీటీడీ కల్యాణ మండపంలో అభినయ కూచిపూడి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 45 రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ కళలను ఆదరించడంతోపాటు భావి తరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వారి ప్రదర్శన అనంతరం వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆకారపు రాజు, డాన్స్ అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

పెద్ద అంతారంలో పాఠశాల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

కులకచర్ల, జూన్ 7 : పాఠశాలల ప్రారంభానికి ముందుగానే పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్ద అంతారం, చింతల్‌కుంటతండా, బిందెంగడ్డతండా పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పిల్లలు పాఠశాలకు వచ్చే విధంగా పాఠశాలలు ఆకర్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఏపీసీ చైర్‌పర్సన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూరా మిషన్ భగీరథ నల్లా సర్వే

కులకచర్లలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణనాయక్

కులకచర్ల, జూన్ 7 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లాల సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణనాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరిగి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉన్న వివరాలను యాప్‌లో అప్‌డేట్ చేయించారు. మిషన్ భగీరథ నీళ్లు ఇంటింటికీ వస్తున్నాయా అనే వివరాలను యాప్‌లో ఎంట్రీ చేసుకుంటున్నట్లు తెలిపారు.

దోమ: మిషన్ భగీరథ నల్లాల సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో మహేశ్‌బాబు అన్నారు. దోమ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో కలిసి ఆయన సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటింటికి వెళ్లి నల్లా కనెక్షన్ ఉన్నదా?లేదా? కనెక్షన్ ఉన్నట్లయితే సరిపడా తాగు నీరు వస్తుందా?రావడం లేదా అనే అంశాలతో కూడిన వివరాలు నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. సర్వేలో ఇంటి యజమాని ఆధార్ నంబర్, మొబైల్ నంబర్‌తో పాటు ఇంటిఫొటో, నల్లా కనెక్షన్ ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

దుకాణంలో పత్తి విత్తనాల ప్యాకేట్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

బషీరాబాద్, మే 7: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను రైతులకు విక్రయించేటప్పుడు నాణ్యాతా ప్రమాణాలు పాటించాలన్నారు. రైతుకు తప్పని సరిగా రసీదు అందజేయాలన్నారు. ప్రతిరోజూ ఎంత స్టాక్‌ను విక్రయిస్తున్నారో స్టాక్ బోర్డు, స్టాక్ రికార్డు బిల్‌బుక్, ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయాలన్నారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బిల్లు, రసీదు లేని నాసి రకం విత్తనాలను, గడువు ముగిసిన విత్తనాలను ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడీఏ వెంట మండల వ్యవసాయాధికారి సూర్యప్రకాశ్, ఏఈవో పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

హత్యకేసులో నిందితుడికి జీవితఖైదు

పరిగి, జూన్ 7 : మహిళను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయలు జరిమానా లేదా 6 నెలలపాటు జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం 2020 ఫిబ్రవరి 27వ తేదీన తన భార్య శాన్నమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్న రమేశ్ అనే వ్యక్తి తాను ఇంట్లో లేని సమయంలో ఆమెతో గొడవపడి రాడ్‌తో తలపై కొట్టి చంపారని మృతురాలి భర్త యాదయ్య పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి సీఐ లక్ష్మీరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పూర్తి స్థాయి సాక్ష్యాధారాలు సైతం కోర్టు ముందు ప్రవేశపెట్టారు. అడిషనల్ పీపీలు నారాయణగౌడ్, రవికుమార్ వాదించారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కు జీవితఖైదు, రూ.1000 జరిమానా లేదా 6 నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి తీర్పు చెప్పారు.

తాండూరు రూరల్,జూన్7: ఎల్లమ్మ తల్లి కృపతో సర్వం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కోత్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

9న ట్రై కమిషనరేట్ల పరిధిలో 144సెక్షన్

జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు బంద్

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పరీక్ష నేపథ్యంలో పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఉండేందుకు ఈ నెల 9న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు పోలీసు కమిషనర్లు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల దూరం వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఆ ప్రాంతాల్లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, ధర్నాలు, రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టడం, సభలు, సమావేశాలు నిర్వహించడం వంటివి నిషేధమని ఆదేశాల్లో పేర్కొన్నారు. అంతే కాకుండా.. పరీక్షా కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరం వరకు జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను సైతం మూసివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 9న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని కమిషనర్లు వెల్లడించారు.

వీసాలు ఇప్పిస్తామని చెప్పి.. మోసం చేసిన దంపతులు

భర్త అరెస్టు, పరారీలో భార్య

హిమాయత్‌నగర్, జూన్7: విదేశాలకు వెళ్లేందుకు వీసాలు ఇప్పిస్తామని చెప్పి పలువురు బాధితులను భార్యాభర్తలు మోసం చేశారు. నారాయణగూడ సీఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. శేరిలింగంపల్లికి చెందిన సీహెచ్. సురేశ్, హరిత దంపతులు. హెచ్1బీ వీసా కోసం సెర్చ్ చేస్తున్న క్రమంలో వీరికి ఫేస్‌బుక్‌లో ఓ కెరీర్ సొల్యూషన్ సంస్థకు సంబంధించిన ప్రకటన కనిపించింది. అందులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి వీసాకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హిమాయత్‌నగర్‌లో ఉన్న కెరీర్ సొల్యూషన్ సంస్థ కార్యాలయానికి రావాలని సూచించడంతో.. ఆ దంపతులు వచ్చి హెచ్1బీ వీసా వివరాలను తెలుసుకున్నారు. ఆ సంస్థకు ఎండీగా ప్రశాంత్ శర్మ, ఆయన భార్య శిల్పాదేశ్ పాండే చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వారు చెప్పినట్లు సురేశ్, హరిత రూ.7లక్షలు చెల్లించారు. వారు ఇచ్చిన గడువు ముగిసినా వీసా అందకపోవడంతో ప్రశాంత్ శర్మ, శిల్పాదేశ్‌పాండేను కలిసి ప్రశ్నించగా.. పెండింగ్‌లో ఉందని, వస్తున్నట్టు నమ్మబలికారు. దీంతో వారికి అనుమానం వచ్చి తాము చెల్లించి డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా.. ఇస్తామని హామీ ఇచ్చిన తరువాత ఎలాంటి స్పందన రాకపోవడంతో బాధితులు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా.. పలువురి వద్ద నుంచి సుమారు రూ.78 లక్షలు వసూలు చేసినట్లు తేలింది. దీంతో పోలీసులు సంస్థ ఎండీ ప్రశాంత్ శర్మను అరెస్ట్ చేశారు. అతడి భార్య శిల్పాదేశ్ పాండే పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎస్సై షఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షంతో.. రైతుల హర్షం

బొంరాస్‌పేట, జూన్ 7 : శుక్రవారం మండలంలో మోస్తరు వర్షం కురిసింది. మృగశిర కార్తెకు ఒకరోజు ముందే మంచి వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానకాలం సాగుకు ఇప్పటికే భూములు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు రెండు మూడు రోజుల్లో విత్తనాలు వేసే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మరో వైపు తీవ్రమైన వేసవి ఎండలతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

రేపు ఆలయ ఉత్సవాలు

మర్పల్లి, జూన్ 7: మండలంలోని పంచలింగాల్ గ్రామంలో ఆదివారం గోవింద మాంబ మద్దీరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఉదయం స్వామి వారికి జలాభిషేకం, యజ్ఞం, మధ్యాహ్నం 12:30 గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం అన్నదానం ఉంటుందని, రాత్రి 9 నుంచి భజన ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

రెండు బైకులు ఢీ..ఒకరికి తీవ్ర గాయాలు

కొడంగల్, జూన్ 7: రోడ్డు పక్కన ఆగి ఉన్న బైక్‌ను మరో బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలైన ఘటన పట్టణ శివారులోని 163 హైవే పై శుక్రవారం చోటుచేసుకుంది. ప్రత్యక్షసాక్షుల కథనం ప్రకారం.. రావులపల్లి నుంచి కొడంగల్‌కు బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టణ శివారులోని మిష్టర్ చాయ్ ముందు బైక్‌ను నిలుపుకొన్నారు. అదే సమయంలో అదే మార్గం నుంచి మరో బైక్ అతివేగంగా ఆగిఉన్న బైక్‌ను వేగం గా ఢీ కొట్టింది. దాంతో నిలిచి ఉన్న వాహనంపై ఉన్న ఓ వ్యక్తి కాలు, చేయి విరగగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు తగిలాయి. అదేవిధంగా ఢీకొన్న బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు కూడా స్వల్పంగా గాయాలు అయ్యాయి.క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ఢీ కొన్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కొడంగల్, జూన్ 7: సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా పశువైద్యాధికారులు పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని కొడంగల్‌తో పాటు గుండ్లకుంట, పాతకొడంగల్ గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశువులకు వ్యాధినిరోధక టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ ఏడీ డా.నోవా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో కురుస్తున్న వర్షాలకు భూమిలో మొలిచే లేత గడ్డిని పశువులు మేయడం ద్వారా గుండెవాపు, జబ్బవాపు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకు గాను రైతులు పశువులను కాపాడుకునేందుకు గాను పశువైద్యశాఖ ద్వారా ఉచితంగా నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాలను తప్పక ఇప్పించి పశువులను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది వెంకటయ్య, శేఖరయ్య పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం


ఎంపీడీవో శ్రీదేవిని సత్కరిస్తున్న ఎంపీపీ హేమీబాయి, ఇన్‌చార్జి ఎంపీడీవో, ఉద్యోగులు

బొంరాస్‌పేట, జూన్ 7: గత నెల 31వ తేదీన పదవీ విరమణ పొందిన ఎంపీడీవో శ్రీదేవిని శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ హేమీబాయి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో మహేశ్, ఏపీవో మల్లికార్జున్, ఎంపీటీసీ జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పూల మాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ, ఇన్‌చార్జి ఎంపీడీవో తదితరులు మాట్లాడుతూ ఎంపీడీవోగా శ్రీదేవి చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులు తాము పనిచేసే చోట చేసే మంచి పనుల కారణంగా ప్రజల నుంచి మన్ననలు పొందుతారని అన్నారు. అనంతరం ఉద్యోగులు ఎంపీడీవోకు జ్ఞాపికను అందజేశారు.